క్లుప్తంగా

కుండపోత వర్షంతో రహదారుల్లో నిలిచిన నీరు



కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయం ముందు నిలిచిన నీరు

కోటవురట్ల: కుండపోత వర్షం రైతుల్లో హర్షం నింపింది. ఇటీవల చాలా వరకు వరినాట్లు వేయగా సుమారు వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. నాట్లు వేశాక వర్షాలు లేక పోవడంతో మెట్ట ప్రాంతాలలో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి వరిచేలకు జీవం వచ్చినట్టయింది. పలు ప్రాంతాలలో వర్షం నీరు రహదారులపై ప్రవహించింది. ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీగా నీరు నిలిచిపోయింది.

ఇసుక ట్రాక్టరు పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

కోటవురట్ల: వరాహనది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టరులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం గొట్టివాడ-పందూరు రహదారిలో ఇసుకతో తరలిపోతున్న ట్రాక్టరును బుధవారం పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సీపీఎం శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కమ్యూనిస్టు నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): తిమ్మరాజుపేట గ్రామంలో సీపీఎం శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శంకర్‌రావు మాట్లాడుతూ దేశంలో సీపీఎం బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ రాము, మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలతో ఎన్నో హక్కులు సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.వి శ్రీనివాసరావు, దేముడునాయుడు, రామునాయుడు, ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, ఆర్.సోమునాయుడు, ఎస్.నారాయణ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలి



పాలవెల్లువ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాయకరావుపేట : గ్రామాల్లో డ్వాక్రా మహిళలు పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని, డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి సాయి శంకర్ అన్నారు. శ్రీరాంపురం గ్రామంలో పాలవెల్లువపై డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. జగనన్న పాలవెల్లువపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పాడి పరిశ్రమపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం పి.రాజుబాబు, ఈవోఆర్డీ వై.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు బీఎల్‌వోలు కృషి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు దాటిన వారందరితో ఓటరుగా నమోదు చేయించాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



లింగాపురంలోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తులు



మల్లవరంలో శ్రీకృష్ణుని మందిరంలో పూజలు చేస్తున్న సర్పంచ్ వాసు, తదితరులు



చినదొడ్డిగల్లు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఏపీ ఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ



యలమంచిలి కాకివాని వీధిలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న కౌన్సిలర్ ఒగిబోయిన చిరంజీవి తదితరులు



కొత్త పోలవరంలో శ్రీకృష్ణుణ్ని దర్శించుకుంటున్న ధర్మశ్రీ తదితరులు



ఒంపోలులో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

యలమంచిలి : శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు బుధవారం యలమంచిలి పట్టణంలో కాకివాని వీధిలో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వార్డు కౌన్సిలర్ ఒగిబోయిన చిరంజీవి ఆధ్వర్యంలో యువత సాయంత్రం శ్రీకృష్ణుడి మందిరం వద్ద ఉట్టి కొట్టు ఉత్సవంలో యువతీ యువకులు పోటీ పడి కొట్టారు. యలమంచిలి పట్టణంలో ద్వారకానగర్‌లో శ్రీ కృష్ణుడి మందిరం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కోలాటం భజన బృందాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా అన్న సమారాధనలు

మండలంలో చినగొల్లలపాలెం, పెదగొల్లలపాలెం, పెదపల్లి, ఏటికొప్పాక, పులపర్తి, ములకలాపల్లి, గూండ్రుబిల్లి, రేగుపాలెం,లైనుకొత్తూరు, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, మెట్టపాలెం, రుక్మిణీపురం, గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల అన్నప్రసాదాలు భక్తులకు అందించారు. పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యువతీ యువకులు ఉట్టుకొట్టు మహోత్సవం సంబరంగా నిర్వహించారు.

ఒంపోలులో...

మునగపాక : ఒంపోలు గ్రామంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు కృష్ణ భగవానుని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

లింగాపురంలో...

కోటవురట్ల: లింగాపురంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు.

పల్లకీలో ఊరేగింపు

నక్కపల్లి : మండలంలో పలు కృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకిలో కృష్ణుడిని ఊరేగించారు. చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, వేంపాడులలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వేంపాడు, గొడిచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పొడగట్ల పాపారావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబు, సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్ పాల్గొన్నారు. కృష్ణునికి పూజలు నిర్వహించారు.

ఘనంగా ఉట్టికొట్టే కార్యక్రమం

ఉద్దండపురంలో జరిగిన జన్మష్టమి వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, ఎంపీటీసీలు చంద్రరావు, బచ్చలరాజు, సర్పంచ్ కృష్ణ, నాయకులు సూరాకాసుల గోవిందు, బొల్లం బాబ్జి, బాబూరావు, పాల్గొన్నారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కృష్ణుడికి ప్రత్యేక పూజలు

అచ్యుతాపురం(అనకాపల్లి): మోసయ్యపేట, గొర్లె ధర్మవరం, ఆవరాజాం, ఎర్రవరం, మల్లవరం, నరేంద్రపురం గ్రామాల్లో శ్రీకృష్ణ మందిరాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లవరంలో శ్రీకృష్ణునికి సర్పంచ్ పిన్నమరాజు వాసు దంపతులు పూజలు చేశారు. ఈ వేడుకల్లో చందక శివ, బాబ్జి, బత్తిన పెద రమణ, ధూళి గోపాలం, బాబూరావు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్

ఎస్.రాయవరం: మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపోలవరం, పెట్టుగోళ్లపల్లి, కోనవానిపాలెం, పెనుగొల్లు తదితర గ్రామాల్లో కృష్ణునికి పూజలు నిర్వహించారు. కొత్త పోలవరం, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, నల్లపరాజు వెంకటరాజు, పాలుమూరి అప్పలరాజు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారుల నిర్మాణం

- రూ.3కోట్లతో ప్రారంభమయిన పనులు
- 3.5 కిలోమీటర్ల మేర పక్కారోడ్లు



పాయకరావుపేటలో చురుగ్గా జరుగుతున్న మెయిన్ రోడ్డు పనులు



సత్యవరం మాసయ్యపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులు

పాయకరావుపేట : మండలంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ప్రధాన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. దశాబ్దాల తరబడి నియోజకవర్గ కేంద్ర ప్రజలు ఎదురు చూస్తున్న పాయకరావుపేట పట్టణ మెయిన్ రోడ్డు పనులు కొద్ది రోజులుగా చురుగ్గా జరుగుతున్నాయి. జాతీయ రహదారి పై జంక్షన్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ (గౌతంసెంటరు) వరకు 2 కిలోమీటర్ల మేర మెయిన్ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు పదేళ్ల నుంచి ఈ మెయిన్ రోడ్డును విస్తరిస్తామని, డబుల్ రోడ్డు వేస్తామని గత పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. తుని, పాయకరావుపేట పట్టణాలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంతాల వారు నానా ఇబ్బందులు పడేవారు. ప్రతిరోజు వేలాది మంది ఈ మెయిన్ రోడ్డు మీదుగా వందలాది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ ఉద్యోగ, వ్యాపారాలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డుమీదుగా వెళ్లే సమయంలో ఇబ్బంది పడేవారు. వర్షం పడితే రోడ్లపై మోకాలి లోతు నీరు చేరడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు, ఆటోవాలాలు ప్రమాదాల బారిన పడేవారు. ఈ రోడ్డును రూ.6కోట్లతో విస్తరించేందుకు నిధులు మంజూరైనప్పటికీ కోర్టు వివాదం కారణంగా పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవ తీసుకుని కోర్టు వివాదం పరిష్కారం అయ్యేలోపు, మెయిన్ రోడ్డును యథావిధిగా పునఃనిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ వారి ద్వారా రూ.1.95 కోట్లు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డును అడుగున్నర పైనే ఎత్తుచేసి పూర్తి స్థాయిలో పునఃనిర్మించే పనులు ప్రారంభమయ్యాయి. సత్యవరం నుంచి మాసయ్యపేట వరకు సుమారు 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.10 ఆర్ఆర్‌సీ నిధులు మంజూరయ్యాయి. పాయకరావుపేట నుంచి పెంటకోట వరకు సుమారు 10 గ్రామాల వారు రాకపోకలు సాగించే మాసయ్యపేట రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఇవి కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ రోడ్ల నిర్మాణపు పనులు ఈనెలాఖరుకు పూర్తి కావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇవి పూర్తయితే ప్రధాన ప్రాంతాలకు రహదారి సమస్య తీరినట్లేనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి స్థాయిలో పునర్నిర్మాణం

సుమారు రూ.1.95 కోట్లతో జాతీయ రహదారి నుంచి పాయకరావుపేట గౌతం సెంటరు వరకు రెండు కిలోమీటర్ల మేర మెయిన్ రోడ్డు నిర్మాణపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డును యథావిధిగా పూర్తి స్థాయిలో పునఃనిర్మించడం జరుగుతోంది. కోర్టు వివాదం కొలిక్కి వచ్చిన తర్వాత రోడ్డు విస్తరణ చేపట్టి ఆరులైన్లుగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. నాణ్యత విషయంలో రాజీ పడకుండా రోడ్డు నిర్మిస్తున్నాం.

–రవిశంకర్, ఏఈ, వీఎంఆర్‌డీఏ

అరబుపాలెంలో నా దేశం-నా మట్టి



పూడిమడకలో ఇంటింటా మట్టిని సేకరిస్తున్న బీజేపీ శ్రేణులు

మునగపాక : మండలంలోని అరబుపాలెం గ్రామంలో బుధవారం నాదేశం-నామట్టి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు బీజేపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి భార్గవాచార్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ నాయకులు బొడ్డేడ భాస్కరరావు,యల్లపు శ్రీరాములు పాల్గొన్నారు.

పూడిమడకలో ..

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక గ్రామంలో నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి స్పూన్ పరిమాణంలో మట్టిని సేకరించారు. ఈ మట్టిని ఢిల్లీలో ఉద్యానవనానికి ఉపయోగించనున్నారు. గ్రామ బీజేపీ అధ్యక్షుడు మేరుగు కాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, అగ్గాల హనుమంతరావు, తురాయి శ్రీరాములు, జోగినాయుడు, బండారు కన్నంనాయుడు పాల్గొన్నారు.

‘బజాజ్’ ప్రాంగణ నియామకాలు



ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో బజాజ్ మోటార్ కార్ప్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ తెలిపారు. కళాశాల ఆవరణలో బుధవారం 100 మంది నిరుద్యోగులకు ఉద్యోగ పరీక్షల అనంతరం, ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, పాడేరు, మాకవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అరకు ప్రాంతాల్లో పనిచేసేందుకు త్వరలో నియామకపత్రాలను అందిస్తామన్నారు. బజాజ్ మోటార్ కార్ప్ హెచ్‌ఆర్‌లు బి.మహేష్, డి.నాయుడులు ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఐ మాధురి, అధ్యాపకులు కె.రాజేష్, ఎస్.ఆర్.జమీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : చిన్నారుల్లో వ్యాధి నిరోధిక శక్తిని పెంచితే రోగాలు దరి చేరకుండా ఉంటాయని హెల్త్ విజిటర్ నాగరత్నం అన్నారు. కొరుప్రోలు వెల్‌నెస్ కేంద్రంలో బుధవారం చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్య విలువలపై అవగాహన కల్పించారు. బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరివేణి, ఏఎన్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



నెహ్రూచౌక్‌లో కురుస్తున్న వర్షం

అనకాపల్లిటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అనకాపల్లిలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. జనజీవనం స్తంభించింది. ఉద్యోగులు, విద్యార్థులు, దైనందిన పనుల్లో బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. గవరపాలెం పరమేశ్వరి పార్కు, అరటి, కొబ్బరికాయల మార్కెట్‌లో వర్షపు నీరు నిలిచి, బురదమయంగా మారింది. వ్యాపార సముదాయాల నిర్వాహకులు, కొనుగోలుదార్లకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పట్టణంలో 13 మి.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీరాంనగర్, ఏఎంసీ కాలనీ, జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్యాక్సీస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. అనకాపల్లి-చోడవరం ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో భారీ వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా మళ్లించారు. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సబ్‌వే వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్ఐ జె.రమేష్, సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు. వచ్చే పోయే వాహనాలకు వేర్వేరుగా మార్గం చూపడంతో ట్రాఫిక్ సమస్య తొలగింది.

దొంగగెడ్డపై వంతెన నిర్మాణం పూర్తి



దొంగగెడ్డపై కొత్తగా నిర్మించిన వంతెన

అనకాపల్లిటౌన్: జిల్లాలో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి బుధవారం సాక్షికి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి, దేవీనగర్‌లో దొంగగెడ్డపై రూ.20 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిందన్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు దేవీనగర్‌లో రెండు బ్రిడ్జిలు తీవ్రంగా దెబ్బతిని కూలిపోయాయన్నారు. వాటి స్థానంలో నిర్మించిన బ్రిడ్జిని త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. అదేరోజు ఆయా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

గాంధీనగరంలో ‘గడప గడపకు’ నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం ఒకటో సచివాలయం పరిధి రామాలయం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, స్థానిక పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కృష్ణావతారంలో వేంకటేశుడు



కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన ధ్యాన వేంకటేశ్వరస్వామి కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని అవతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. చేత పిల్లన గ్రోవి పట్టుకున్న కృష్ణుని అవతారంలో ఆర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ

తుమ్మపాల: అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తానని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చినట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా నాయకులు గొర్లి తరుణ్ తెలిపారు. పట్టణంలో బుధవారం మంత్రి అమర్‌నాథ్‌ను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావించాలని విన్నవించారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు శాంక్షన్ ఆర్డర్‌తో త్వరలో శంకుస్థాపన చేస్తానని భరోసానిచ్చారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల మెరుగుకు వినతి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యురాలు బీవీ సత్యవతిని బుధవారం ఎస్సీ, బీసీ వసతిగృహ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, పి.నారాయణరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు పలు అభ్యర్థనలతో వినతిపత్రం అందించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల సహకారంతో, ఎంపీ నిధుల ద్వారా వసతిగృహాలను అభివృద్ధి చేస్తామని ఎంపీ సత్యవతి హామీ ఇచ్చారు.

భారత్ జోడో యాత్ర సంఘీభావ ప్రదర్శన నేడు



మాట్లాడుతున్న లక్కవరపు రామారావు

అనకాపల్లిటౌన్: రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్రతో దేశంలో కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్సాహం వచ్చిందని ఏపీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కవరపు రామారావు అన్నారు. స్థానిక గాంధీనగరం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ జరిగిన రాహుల్ గాంధీ పాదయాత్ర దేశ ప్రజలను ఉత్తేజపరచిందన్నారు. జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గురువారం నెహ్రూచౌక్‌లో పాదయాత్ర సంఘీభావ ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ శ్రేణులంతా కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐ.ఆర్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.